క్లుప్తంగా

బాధితులకు పోచారం పరామర్శ



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యానికి గురైన పలువురు బాధిత కుటుంబాలను బుధవారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. వారిని పోచారం కలిసి ఓదార్చారు. బాధితులకు అండగా ఉంటానని పోచారం భరోసా ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రఘు, బస్వరాజ్, యామ రాములు, అవారి గంగారాం, శశికాంత్ తదితరులున్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు

భిక్కనూరు: మండల కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దమ్మ ఆలయం సమీపంలో కింద పడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో ఏఈ సంకీర్త్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ సిబ్బంది మాణిక్యం, వేణు, తదితరులు ఉన్నారు.

యూత్ అధ్యక్షుడిగా నగేష్



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన నగేష్‌ను మదన్‌మోహన్‌రావు యూత్ ఫోర్స్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నందున ఆయనకు ఈ పదవీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షుడు సంతోష్‌నాయక్, రామకృష్ణగౌడ్, ప్రసాద్ గౌడ్, వాహబ్, రాజేశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు కాలనీలలో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గణపతి నిమజ్జనం దృష్ట్యా వినాయక విగ్రహాలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించి వాటి స్థానంలో నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ విజయసారథి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

దోమకొండ: సంగమేశ్వర్ గ్రామానికి చెందిన గోత్రాల బాలరాజు ఇటీవల ఎడ్ల కట్టవాగు వరదలకు కొట్టుకపోగా, ప్రభుత్వ పరంగా మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి బుధవారం విలేకరులతో తెలిపారు. మృతుడి భార్య రూప బ్యాంకు అకౌంట్‌లో నగదు జమైనట్లు వివరించారు. అకౌంట్ జిరాక్స్‌ను బాధిత కుటుంబసభ్యులకు అందజేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రామస్వామి గౌడ్, చంద్రారెడ్డి, బాపురెడ్డి, గోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆశబోయిన శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఎస్ఆర్ ఫౌండేషన్ తరఫున రూ.10 వేలు..

బీబీపేట: మండలంలోని ఇస్సానగర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి బుధవారం ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుభాష్‌రెడ్డి తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అంతే కాకుండా పెద్ద చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న సాయి కుటుంబానికి 2001–02 పదవ తరగతి విద్యార్థులు 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రాజంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఇబ్బంది పడ్డ ప్రజలకు పలు స్వచ్ఛంద సంస్థలు వారికి సహకారం అందించి బాసటగా నిలుస్తున్నాయి. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ సాయి ట్రస్ట్ సభ్యులు నడిమితండాలోని 173 మంది కుటుంబాలకు రూ.1200 విలువ గల నిత్యావసర సరుకులను అందజేశారు. ఎల్లాపూర్ తండాలో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో 175 కుటుంబాలకు రూ.1000 విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు. ఎంపీడీవో బాలక్రిష్ణ, పంచాయతీ కార్యదర్శులు లావణ్య, గౌరీ, సంస్థల ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

'పొదుపు అలవర్చుకోవాలి'

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరు పొదుపు చేయడం అలవర్చుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ గణేశ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఫైనాన్షియల్ లిటరసీలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. పొదుపు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా..వెళ్లేదెలా?

- పది రోజులైనా రోడ్లకు మరమ్మతులు కరువు
- వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి
- పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులు



జనగామ - మాందాపూర్ మధ్యలో ఎడ్ల కట్టవాగు వద్ద తేలిన రాళ్లు



మాందాపూర్ వెళ్లే దారిలో తెగిపోయిన రోడ్డు

బీబీపేట: పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో అతలాకుతలమవడంతో పాటు చాలా చోట్ల రోడ్లు పూర్తిగా తెగిపోయి కనీసం నడవడానికి కూడా వీలు పడడం లేదు. మరమ్మతులకు నోచుకోవడం లేదు. భారీ వర్షాలకు జనగామ – మాందాపూర్ గ్రామాల మధ్య ఉన్న ఎడ్ల కట్ట వాగు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. అంతే కాకుండా వరి పొలాల్లో ఇసుక మేట్లు వేశాయి. ఎడ్లకట్ట వాగు వద్ద అప్పట్లో వేసిన రాళ్లు పూర్తిగా తేలాయి. దీంతో రాకపోకలు బంద్ అవడంతో వాహనదారులతో పాటు సమీప రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా మాందాపూర్ సమీపంలో పూర్తిగా పంట కాలువలను ముంచెత్తుతూ వచ్చిన వరదతో రోడ్డు రెండు కిలోమీటర్లు మేర ధ్వంసమైంది.

వాగు అవతల పొలాలు..

మాందాపూర్, జనగామ గ్రామస్తుల వరి పొలాలు సమీప వాగుకు అవతల, ఇవతల ఉన్నాయి. రైతులు పొలాల వద్దకు పూర్తిగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కాలినడకన మాత్రమే వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు భుజాలపై మోసుకెళ్లాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.

పైపులు కొట్టుకుపోయాయి



మాందాపూర్ వెళ్లే రోడ్డులో పాతకాలంలో పది పైపులను వేసి రోడ్డును వేశారు. మొన్నటి వరదలకు పైపులు పూర్తిగా వరదలకు కొట్టుకుపోయాయి. రోడ్డు పూర్తిగా తెగిపోవడంతో బీబీపేటకు, కానీ కామారెడ్డికి కానీ చుట్టూ తిరిగిపోవాల్సి వస్తోంది. ఎడ్ల కట్ట వాగుపై పెద్ద బ్రిడ్జి నిర్మాణంతో పాటు, మరో మూడు చోట్ల వంతెనలు ఏర్పాటు చేయాలి. అధికారులు చొరవ తీసుకొని రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– బాగిరెడ్డి, రైతు, మాందాపూర్

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చంద్రకాంత్ రెడ్డి

భిక్కనూరు: ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం తిప్పాపూర్‌లో తపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసమహర్షి జన్మదినోత్సవాల సందర్భంగా నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సేవలు అమోఘమని, దేశ భావిభారత పౌరులను తీర్చిదిద్దే వీరు ప్రపంచానికి ఆదర్శనీయులన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్ఎం యాదగిరి ఉపాధ్యాయులు వాణిశ్రీ, విష్ణుప్రియ, ఉమారాణి, నర్సింహారెడ్డి, సురేష్, నందిని, అజులను శాలువాలతో సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, నేతలు జాంగారి గాలిరెడ్డి, కుంట లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రాకతో రోడ్లకు మరమ్మతులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): లింగంపేట్, ఎల్లారెడ్డి మండలాలలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం పర్యటించనుండటంతో అధికారులు తాడ్వాయి మండలంలోని ప్రధాన రహదారులను బాగు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు అధ్వానంగా తయారు కావడంతో బైకులు నడిపించే వారు సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. కానీ సీఎం వస్తున్నారని తెలిసి అధికారులు కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై గుంతలను పూడ్చి బాగు చేయించారు. ఏదో రకంగా రోడ్లు మంచిగా అవుతున్నందుకు ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి



గాంధారి(ఎల్లారెడ్డి): పోడు పట్టాలు పొందిన పేద గిరిజన రైతులకు బ్యాంకుల్లో పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మోతీరాం నాయక్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ధర్నా చేశారు. గాంధారి–కామారెడ్డి ప్రధాన రహదారిపై బస్టాండ్ ఎదురుగా గంటపాటు ధర్నా చేశారు. పోడు పట్టాలు పొందిన గిరిజన రైతులకు బ్యాంకుల్లో పంటరుణాలు అందక అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి పెట్టుబడి పెడుతూ నష్టపోతున్నారన్నారు. అనంతరం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజరుకు వినతి పత్రం ఇచ్చారు.

పంట నష్ట పరిహారం త్వరగా అందించాలి



దొంగ్లీలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరుణతార



హన్మాజీపేటలో పరిశీలిస్తున్న ఏఈవో జ్ఞానేశ్వర్

- మాజీ ఎమ్మెల్యే అరుణతార

మద్నూర్(జుక్కల్): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటలు బాగా దెబ్బతిన్నాయని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఆర్థికంగా ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే అరుణతార పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని లింబూర్, పెద్ద టాక్లీ, సిర్పూర్ గ్రామాల్లో వరద ప్రాంతాలలో బుధవారం ఆమె బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు తుకారాం, నాయకులు కృష్ణ పటేల్, అరుణ్ పటేల్, వెంకట్ కాలే తదితరులున్నారు.

హన్మాజీపేట్‌లో..

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్‌లో ఇటీవల భారీ వర్షాలకు జరిగిన పంటనష్టాన్ని ఏఈవో జ్ఞానేశ్వర్ పరిశీలించారు. పొలాల్లో భారీ వరదల వల్ల ఇసుక, మట్టి మేటలు వేసిందని, ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగరిగారి సంజీవులు, ఇతర రైతులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర



బాన్సువాడ రూరల్: బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్రలను తెలంగాణ ప్రభుత్వం తిప్పికొట్టాలని మండలంలోని రాంపూర్ తండా గిరిజనులు డిమాండ్ చేశారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ నాయకులు సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావ్‌లు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం బాధాకరమన్నారు. ఆదివాసీలు, లంబాడాల మధ్య చిచ్చుపెట్టడానికి కొందరు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం బంజారాలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బలరాం నాయక్, విఠల్‌చవాన్, హరిచంద్, గోవింద్, విఠల్, జైరామ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై గ్రామస్తులకు అవగాహన



కిష్టాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

బాన్సువాడ: బ్యాంకు సేవలు, ఇన్సూరెన్సు, ఏటీఎం, సేవింగ్స్‌పై బుధవారం బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ ఆదేశాలతో కెనరా బ్యాంకు సహకారంతో ఎస్ఎస్‌టీ ఎన్‌జీవో బాన్సువాడ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు మాట్లాడుతూ.. బ్యాంకులలో, పోస్టాఫీసుల్లో ఉండే ఇన్సూరెన్సు పథకాలు, బ్యాంకు ఖాతాలు, సేవింగ్స్, ఏటీఎం, సుకన్య సంవృద్ధి పథకం, ఏపీవై గురించి వివరించారు. సైబర్ క్రైమ్ మోసాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కళాజాత బృందం గేయాల రూపంలో గ్రామస్తులకు వివరించారు. జీపీ కార్యదర్శి శ్రీనివాస్, యుబీఐ ప్రతినిధి సంజీవ్, కౌన్సిలర్ బాలకృష్ణ, తదితరులున్నారు.

కన్నీరు మిగిల్చిన వాన

- లింగంపేట పరిధిలో 4 వేల ఎకరాల్లో పంటలు నాశనం
- పంట పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలు
- అప్పుల పాలైన అన్నదాతలు
- నష్ట పరిహారం కోసం ఎదురుచూపులు



పాముల వాగు పరీవాహక ప్రాంతం లింగంపల్లి శివారులో ఏర్పడిన ఇసుక మేటలు



చౌదరి చెరువు కట్ట తెగిపోవడంతో కన్నాపూర్‌లోని పంట పొలాల్లో చేరిన బండరాళ్లు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలు రైతులకు కన్నీరు మిగిల్చాయి. భారీ వర్షంతో అపార నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి, చెమటోడ్చి సాగు చేస్తున్న పంటలను వరుణ దేవుడి ప్రకోపానికి వరి పంటలు కొట్టుకుపోయాయి. మండలంలో సుమారు నాలుగు వేల ఎకరాలు నీట మునిగి రైతులు నష్టపోయినట్లు మండల వ్యవసాయాధికారి తెలిపారు. వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు, బురద ఏర్పడింది. ప్రకృతి వైపరీత్యంతో వందలాది మంది రైతులు రోడ్డున పడ్డారు. కన్నాపూర్, పోల్కంపేట శివారులోని చౌదరి చెరువు కట్ట తెగిపోవడంతో 500 ఎకరాలు నీట మునిగి ఇసుక మేటలు, బండ రాళ్లు పంట చేలల్లోకి వచ్చి చేరాయి. లింగంపల్లి శివారులోని మల్లారం చెరువు కట్ట తెగిపోవడంతో 400 ఎకరాలు నీట మునిగాయి. పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. పెద్దవాగు, పాముల వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో పరివాహక ప్రాంతాల్లో వరి, పత్తి, సోయా, మొక్కజొన్న, చెరుకు పంటలు నీట మునిగి నాశనమయ్యాయి. అధికారులు పంట పొలాలను పరిశీలించి వెంటనే నష్ట పరిమారం చెల్లించాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. 3,305 ఎకరాల్లో వరి, 280 ఎకరాల్లో మొక్కజొన్న, 210 ఎకరాల్లో పత్తి, 15 ఎకరాల్లో సోయాబీన్, 45 ఎకరాల్లో చెరుకు పంట నష్టం జరిగినట్లు అధికారి అనిల్‌కుమార్ తెలిపారు.

అప్పుల పాలైన



కన్నాపూర్ శివారులోని చౌదరి చెరువు కింద మూడున్నర ఎకరాలు వరి పంట సాగు చేశాను. రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. మూడున్నర ఎకరాల్లో పూర్తిగా ఇసుక మేటలు ఏర్పడ్డాయి. ఇప్పటికే పెట్టుబడికి రూ. లక్ష అప్పు చేసి అప్పుల పాలైనా. పంట చేతికి వస్తే అప్పులు తీరేవి. ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నాను. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. – రాజీపేట శ్రీనివాస్‌గౌడ్, కన్నాపూర్

కళ్లముందే కొట్టుకుపోయింది



చేతికి వచ్చే పంట వరద నీటి ఉధృతికి కళ్లముందే కొట్టుకుపోయింది. చెరువు కింద మూడు ఎకరాలు సాగు చేశాను. పొలం మొత్తం పొట్ట దశకు వచ్చింది. మంచి దిగుబడి వస్తుందనుకున్నా నేడు మొత్తం బండరాళ్లలో నిండి ఉంది. చేను వద్దకు వెళ్తే కన్నీళ్లు వస్తున్నాయి. 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా వరదలు వచ్చాయి. ఇసుక మేటలు, బండరాళ్లు తొలగించడానికి బాగా ఖర్చవుతుంది. – గురుడు నరేష్ గౌడ్, పోల్కంపేట

డిజిటల్ పరికరాల వినియోగంపై జాగ్రత్త



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులు డిజిటల్ పరికరాలను వినియోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ సూచించారు. గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో సైబర్ భద్రతపై బుధవారం విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను ఇతరులకు పంపవద్దన్నారు. అనధికార లింక్‌లను, అనుమానాస్పద ఫైళ్లను తెరొవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్లు చేసే బెదిరింపులతో పాటు వాటిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్, ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అర్ధ చాతుర్మాస్య దీక్షలు



కామారెడ్డి అర్బన్: ఆధ్యాత్మిక చింతనతో పవిత్ర అర్ధచాతుర్మాస్య వ్రతం పాటించడం సామాన్య విషయం కాదని, తర్వాతి రోజు వారి జీవితంలోనూ నియమాలు పాటిస్తూ పవిత్రంగా ఉండాలని బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామీజీ అన్నారు. ఆషాఢ ఏకాదశి నుంచి భాద్రపద ఏకాదశి వరకు రెండు నెలల పాటు కామారెడ్డి శ్రీకృష్ణ గీతా మందిరంలో జూలై 6న ప్రారంభమైన 43వ శ్రీఅర్ధ చాతుర్మాస్య మహావ్రతం బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో జ్ఞాన చైతన్యానంద స్వామి, కృష్ణానంద స్వామీజీలు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. శ్రీకృష్ణ ధ్యానమందిరం అధ్యక్షుడు పాత అశోక్, కార్యదర్శి అర్వపల్లి రమేష్, ప్రతినిధులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న పైడి ఎల్లారెడ్డి



నాగిరెడ్డిపేటలో నిత్యావసర సరుకులు అందజేస్తూ..

ఎల్లారెడ్డి/లింగంపేట/నాగిరెడ్డిపేట: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి, వెంకటాపూర్, అన్నాసాగర్.. నాగిరెడ్డిపేట, మాల్తుమ్మెద.. లింగంపేట మండల పరిధిలో పలు గ్రామాల్లో వరదల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఇళ్లు కూలిన బాధితులను పరామర్శించారు. వారంరోజులకు సరిపడా బియ్యం, పప్పులు, ఇతర కూరగాయల వంటి నిత్యావసర సరుకులను బాధితులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు కూలిన వారికి, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించేలా చూడాలని అన్నారు. చాలా మంది నిత్యావసర వస్తువులు లేక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి సత్వరంగా సహాయం చేయాలని అన్నారు.

సంక్షిప్తం

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటల పోటీలు



నస్రుల్లాబాద్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని దుర్కి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్టీ ఎస్సీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సునీల్ రాథోడ్ పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 29న హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తామన్నారు. వర్షాల కారణంగా బుధవారం విద్యార్థినులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, వైస్ ప్రిన్సిపాల్ దుర్గారాణి, ఉపాధ్యాయులు దీపిక, పీఈటీ ఐశ్వర్య పాల్గొన్నారు.

తాడ్కోల్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. హన్మాజీపేట్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇమ్రాన్ వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులను పరీక్షించారు. వారికి కావాల్సిన మందులు ఉచితంగా అందజేశారు. ఆరోగ్య సూచనలు చేశారు. హెచ్ఈవో రవి, సూపర్‌వైజర్ పాప, ఎంపీహెచ్‌పీ తిరుమలేష్, ఏఎన్‌యం జ్యోతి, రామచందర్, తదితరులు ఉన్నారు.

తాడ్వాయిలో చిన్న పిల్లలకు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత చిన్న పిల్లల వైద్య శిబిరం ఏర్పాటు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి కామారెడ్డిలోని ఆర్‌కే చిన్న పిల్లల ఆస్పత్రికి చెందిన డాక్టర్ రమేష్ వచ్చారు. 150 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులు, మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. వీడీసీ చైర్మన్ మేకల రాజు, విశ్వబ్రాహ్మణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కమ్మరిరాజు, కమ్మరి నర్సింలు, రవికుమార్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మొగాలోని ప్రాథమికోన్నత పాఠశాలలోని 110 మంది విద్యార్థులకు అదే పాఠశాలలో పని చేస్తున్న రేఖావార్ రమేశ్ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమేశ్ మాట్లాడారు. తన కూతురు సంజన ఉన్నత చదువుల కోసం లండన్‌కు వెళ్తున్నందున ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.